క్లుప్తంగా

ముగిసిన చెంగాళమ్మ జాతర



గ్రామంలో విహరిస్తున్న చెంగాళమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోటలో చెంగాళమ్మ జాతర సోమవారంతో ముగిసింది. చివరి రోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం చెంగాళమ్మ ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు పొంగళ్లు పెట్టి, కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అన్నదానం



అన్నం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సత్యవేడు: జిల్లా కార్మిక సంఘం అధ్యక్షుడు బీరేంద్ర వర్మ 49వ జన్మదినం సందర్భంగా సోమవారం సత్యవేడులో 300 మందికి అన్నదానం చేశారు. సింగిల్ విండో అధ్యక్షుడు కేవీ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో మూడురోడ్ల కూడలిలోని గాంధీ విగ్రహం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, సెంథిల్, చిన్నా, మధుసూదన్‌రావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గురుప్రసాద్, అరుల్, మోహన్ రెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు మస్తాని, మాణిక్యం, వెంకటేశం, శ్యాంప్రసాద్ రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసం వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రాఘవయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని అరుంధతివాడలో ఇంటి స్థలాలు లేని ఎస్సీలకు స్థలాలను ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మల రాఘవయ్య మాదిగ సోమవారం తహసీల్దార్ భార్గవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ప్రభుత్వ భూమిని గుర్తించి అర్హులైన దళితులకు ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



సమావేశమైన ముదిరాజ్ సంఘ నాయకులు

శ్రీకాళహస్తి: పట్టణంలో పట్టణ ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కన్నయ్య, ప్రధాన కార్యదర్శి గా వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. అలాగే నియోజకవర్గ కమిటీని కూడా ప్రకటించారు. అధ్యక్షుడిగా వల్లమ కన్నయ, గౌరవాధ్యక్షులుగా పిల్లారి బత్తినయ్య, పూల ఆనంద్, చిట్టేటి చిన్న, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటరమణయ్య, ఉపాధ్యక్షులు గా సుబ్రహ్మణ్యం, సుధాకర్, అంకయ్య, ప్రధాన కార్యదర్శిగా అల్లిపూడి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా బొజ్జ గోవిందస్వామి ఎన్నికయ్యారు. మహి ళా విభాగం అధ్యక్షురాలిగా నాగలక్ష్మిని ఎంపిక చేశారు. అలాగే, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వల్లమ కన్నయ్య మాట్లాడుతూ రానున్న కాలంలో ముదిరాజ్ సంఘాన్ని మరింత బలో పేతం చేస్తామన్నారు. ముదిరాజ్‌లకు చెందాల్సి న హక్కులు, నామినేటడ్ పోస్టులు, రాజకీయ పదవుల్లో నియామకం కోసం పోరాటం చేస్తామన్నారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట పీహెచ్‌సీ డాక్టర్లు నాగరాజు, శిల్ప ఆధ్వర్యంలో సోమవారం పలు ప్రభుత్వ పాఠశాలల్లో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. పాపానాయుడుపేట, మునగలపాలెం, కందాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 35 మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశా రు. అలాగే మందులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు జయకుమార్‌రెడ్డి, ఆప్తాల్మిక్ అధికా రి నారాయణస్వామి, పీహెచ్‌ఎన్ అన్నపూర్ణ, సూపర్ వైజర్ సుబ్రమణ్యం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలకు బస్సులు నడపరూ!

ఏర్పేడు: మండలంలోని అన్ని గ్రామాలకు బస్సులు నడపాలని యువనేస్తం అసోసియేషన్ వ్యవస్థాపకుడు మునిశేఖర్ శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజవర్ధన్‌రెడ్డికి సోమవారం వినతి పత్రం ఇచ్చారు. ప్రస్తుతం ఆరులేన్ల రోడ్డు పనులు చేస్తుండటం మూలాన రోజూ ట్రాఫిక్ అంతరాయం కలిగి విద్యార్థులు సకాలంలో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రోజూ ఉదయం, సాయంత్రం గ్రామాలకు బస్సులు నడిపితే విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

రోగులకు సేవా దృక్పథంతో సేవలు

శ్రీకాళహస్తి: రోగులకు సేవా దృక్పథంతో సేవలందించాలని న్యాయవాది రాజేశ్వరరావు అన్నారు. పట్టణంలోని గజేంద్రనగర్ ప్రైమరీ హెల్త్‌సెంటర్‌లో సిబ్బందికి చట్టాలపై అవగాహన కల్పించారు. పరిసరాల్లో శుభ్రతను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో న్యాయవాదులు రమేష్‌బాబు, అరుణ్, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.





ప్రత్యేక ప్రతిభావంతులకు జిల్లాస్థాయి పోటీలు

స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రత్యేక ప్రతిభావంతుల జిల్లా స్థాయి క్రీడాపోటీలను బియ్యపు పవిత్రారెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని ఆమె మాట్లాడారు. ప్రత్యేక ప్రతిభావంతులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓలు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు. - శ్రీకాళహస్తి

గ్రామీణ క్రీడాకారులకు వరం 'ఆడుదాం ఆంధ్రా'



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్



పిచ్చాటూరు: మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

సత్యవేడు: 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సంబరాలు గ్రామణ క్రీడాకారులకు వరం లాంటిదని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా క్రీడల నిర్వహణపై ఎంఈఓ రవితో కలిసి సచివాయ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, పీడీ, పీఈటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలికి తీయడానికి రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సంబరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కోకో, కబడ్డీ తదితర క్రీడల్లో ప్రతిభ కలిగిన గ్రామీణ క్రీడాకారులను గుర్తించి వారిపేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామం, సచివాలయం, మండల స్థాయిలో నిర్వహించే పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. నియోజవర్గస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి రూ. 35వేలు, ద్వితీయ బహుమతి రూ. 15 వేలు, తృతీయ బహుమతి రూ.5వేలు చొప్పున అందజేస్తారన్నారు. అక్టోబరు 2 నుంచి 47 రోజుల పాటు క్రీడా సంబరాలు నిర్వహిస్తామన్నారు. ఎంఈఓ–2 ఉషా, ఈఓపీఆర్డీ ముని రవికుమార్, పీడీ మురళి, పీఈటీ ఢిల్లి రాణి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, చిన్నబాబు, భారతి, మునిమోహన్ పాల్గొన్నారు.

పిచ్చాటూరు: 'ఆడుదాం ఆంధ్రా' పోటీలను విజయవంతం చేద్దామని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణపై మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. అక్టోబర్ 2వ తేదీ నుంచి సచివాలయ స్థాయిలో ఖోఖో, కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, బ్యాట్మింటన్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 17 ఏళ్ల పైబడిన స్థానికులు ఈ పోటీలకు అర్హులన్నారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ కేటీ హరిశ్చంద్రారెడ్డి, తహసీల్దార్ మధుసూదన్ రావు, ఎంఈఓ యుగంధర్ రాజు, మురళి తదితరులు పాల్గొన్నారు.

తులసికి డాక్టరేట్



శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీవిద్యా ప్రకాశానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్న మూడే తులసికి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. 'న్యూరో ప్రొటెక్టివ్ ఎఫెక్ట్ ఆఫ్ ఎంబ్లికా అఫిసినాలిస్ ఫ్రూట్ ఎక్స్‌ట్రాక్ట్ ఆన్ అల్జీమీర్స్ డిసీజ్ ఇండ్యూస్డ్ రాట్ బ్రెయిన్–ఏ నావల్ అప్రోచ్ టు ఐడెంటిఫై ద యాంటీ–అల్జీమీర్స్ కాంపౌండ్స్' అనే అంశంపై ఎస్వీయూ జంతు శాస్త్ర విభాగానికి చెందిన ప్రొఫెసర్ కె.ఎల్లమ్మ పర్యవేక్షణలో పరిశోధన పత్రం సమర్పించినందుకు ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ వై.నాగరాజునాయుడు తెలిపారు. ఆమెను పలువురు అధ్యాపకులు అభినందించారు.

ఎంబ్లికా అఫిసినాలిస్ చూర్ణం ఉపయోగిస్తే..

అల్జీమీర్స్ వ్యాధి 60 ఏళ్ల పైబడిన వారికి వస్తుందని, మెదడులో నరాలు క్షీణించి, మతిమరపు వ్యాధి (అల్జిమర్స్)కి దారితీస్తుందని తులసి చెప్పారు. ఆయుర్వేద గుణం కలిగిన ఎంబ్లికా అఫిసినాలిస్ చూర్ణాన్ని ఉపయోగిస్తే కొంతవరకు ఈ వ్యాధిని నివారించవచ్చని తాను పరిశోధన చేశానని, అందుకే తనకు ఎస్వీయూ డాక్టరేట్ ప్రదానం చేశారని ఆమె చెప్పారు.

గాయపడిన వ్యక్తి మృతి

భాకరాపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు భాకరాపేట ఎస్‌ఐ ప్రకాష్‌కుమార్ తెలిపారు. భాకరాపేట సమీపంలోని నెమిలిగుండ్ల వద్ద ఉన్న మెగా కంపెనీలో ఆపరేటర్‌గా పని చేస్తున్న ముఖేష్‌చౌదరి(37) ఆదివారం రాత్రి కార్యాలయానికి నడుచుకుంటూ వెళుతుండగా పీలేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని కంపెనీకి చెందిన కార్మికులు, పోలీసులు 108లో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ అతను సోమవారం ఉదయం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జేబు దొంగకు జైలు

తిరుపతి లీగల్: తిరుమలలో ఓ వ్యక్తి జేబులోని సొమ్మును చోరీ చేసిన కేసులో కృష్ణా జిల్లా పోరంకి మండలం తుషానం కట్టకు చెందిన డి.గోపికి రెండు నెలల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వర రావు సోమవారం తీర్పు చెప్పారు. ఈ ఏడాది జూన్ 19వ తేదీన విశాఖపట్నం జిల్లాకు చెందిన యాకూబ్ తిరుమల రెండో వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద ఉన్నాడు. అతని ప్యాంట్ జేబులోని రూ.9,500 చోరీకి గురైంది. అతని ఫిర్యాదు మేరకు తిరుమల ఒన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు గోపి, మరొకరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితుడు గోపి నేరం అంగీకరించడంతో న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

మానవ అక్రమ రవాణా అరికడదాం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

ఏర్పేడు: మానవ అక్రమ రవాణా అరికడదామని ప్రగతి సంస్థ డైరెక్టర్ వెంకటరమణ అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రపంచ బాలల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణా ఓ కనిపించని నేరమన్నారు. తప్పిపోయిన పిల్లల, బాలకార్మికులు, అపహరణ, వాణిజ్యపరమైన లైంగిక దోపిడి, పిల్లలపై ఇతర నేరాల సమస్యలతో ముడిపడి ఉందన్నారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులను గుర్తిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గిడ్డయ్య, ఎంఈఓ ప్రేమలత, ప్రగతి సంస్థ మండల కన్వీనర్ శిరీష పాల్గొన్నారు.

జనావాసాల మధ్యనే వ్యర్థాలకు నిప్పు!




ఫ్లై ఓవర్ కింద చెత్తకు నిప్పు పెట్టడంతో రేగుతున్న పొగ

రేణిగుంట: స్థానిక బిస్మిల్లానగర్ సమీపంలోని ఫ్లై ఓవర్ వంతెన కింద కొందరు వ్యర్థాలను, ప్లాస్టిక్ వ్యర్థాలను తెచ్చి పడేసి నిప్పు పెట్టడంతో దుర్వాసనతో కూడిన పొగ చుట్టుపక్కల వ్యాపిస్తోంది. దీంతో స్థానికులు పంచాయతీ అధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. బిస్మిల్లానగర్‌లోని వివిధ అపార్ట్‌మెంట్లలో ఉన్న వారు చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను వంతెన కింద పడేస్తున్నారు. సోమవారం ఆ వ్యర్థాలను నిప్పు పెట్టడంతో దట్టమైన పొగ వ్యాపించి సమీపంలో ఉన్న ఓ స్కూల్ ఆవరణ ప్రాంతంలో కమ్ముకుంది. దీంతో స్కూల్ పిల్లలు శ్వాస పీల్చేందుకు ఇబ్బందిపడ్డారు. తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లేందుకు అప్పుడే అక్కడకు వచ్చిన కొందరు తల్లిదండ్రులు విషయాన్ని ఈఓపీఆర్‌డీ వెంకటరత్నమ్మ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు.

సంచార జాతుల కార్పొరేషన్లకు నిధులు విడుదల చేయాలి

తిరుపతి కల్చరల్: సంచార జాతుల ఎంబీసీ, దాసరి, మేదరి, జంగం, వడ్డెర, యాతా, రెడ్డిక వంటి కార్పొరేషన్లకు నిధులు విడుదల చేసి ఆదుకోవాలని సంచార జాతుల అభివృద్ధి మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాపూరు డోలాకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని సుమారు 70 లక్షలకు పైగా ఉన్న సంచార జాతుల వారు రాష్ట్ర ప్రభుత్వానికి అండగా ఉంటారని తెలిపారు. అలాగే రాష్ట్రంలోని సంచార జాతుల జన గణన చేపట్టాలని కోరారు. సమావేశంలో సంచార జాతుల అభివృద్ధి మండలి తిరుపతి జిల్లా నేతలు పి.ప్రసాద్, జి.వెంకటసుబ్బయ్య, సానాల గంగాధరం, బి.ఓంకార్, మహిళా కార్యదర్శి ఆకుల సుమతి పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే చరిత్ర హీనులే



అభివృద్ధిని అడ్డుకోకండి...అంటూ నినదిస్తున్న విద్యార్థి, ఉద్యోగ సంఘాల నాయకులు, విద్యార్థులు

తిరుపతి సిటీ: తిరుపతి నగరంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకుంటే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్వీయూ పరిపాలనా భవనం వద్ద సోమవారం విద్యార్థి సంఘాలు చేపట్టిన నిరసనలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తిరుపతిలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు విద్యార్థుల్లో అపోహలను కలిగిస్తున్నారని ఆరోపించారు. నగరంలో ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. రాయలసీమకే తలమానికమైన స్విమ్స్, రుయా వంటి ఆసుపత్రులు ఎస్వీయూ సమీపంలోనే వున్నాయని, నగరానికి వీఐపీల తాకిడి ఎక్కువైనప్పుడు అంబులెన్స్‌లు, ప్రాణాపాయ స్థితిలో వున్న రోగులు ఆసుపత్రులకు చేరుకోవాలంటే ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే యూనివర్సిటీలో రోడ్లను విస్తరించి, ఎన్జీసీ నగర్ మీదుగా రోడ్డును పూర్తి స్థాయిలో నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గత టీడీపీ పాలనలోనే తిరుపతి అభివృద్ధికి సంబంధించి మాస్టర్ ప్లాన్ కోసం జీవో నెంబర్ 112ను విడుదల చేశారన్నారు. 2040 వరకు మాస్టర్ ప్లాన్ అమలులో ఉంటుందని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలిచ్చారన్నారు. ఈ విషయం తెలిసినా టీడీపీ, జనసేన నాయకులు రాజకీయ లబ్ధికోసం కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. యూనివర్సిటీ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం రోడ్ల విస్తరణ చేపట్టడాన్ని స్వాగతించాలన్నారు. అనంతరం వీసీ రాజారెడ్డికి వినతి పత్రం సమర్పించి, యూనివర్సిటీ రోడ్ల విస్తరణ, మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణ ప్రణాళికను ఆయనకు వివరించారు. కార్పొరేటర్ పరదేశి నరేంద్రనాథ్, కో–ఆప్షన్ మెంబర్ ఇమామ్, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ ఇమ్రాన్ బాషా, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు మురళీ రెడ్డి, ఎస్వీయూ నాన్ టీచింగ్ యూనియన్ నాయకులు శ్రీనివాస్‌రాజు పాల్గొన్నారు.

కనుల పండువగా ధర్మరాజు పట్టాభిషేకం



పిచ్చాటూరులో ఊరేగుతున్న ద్రౌపదీ అమ్మవారు



ధర్మరాజుస్వామి పట్టాభిషేకం

పిచ్చాటూరు: మండల కేంద్రంలోని ధర్మరాజుల స్వామి ఆలయంలో పది రోజులుగా జరుగుతున్న తిరునాళ్ల సోమవారం సాయంత్రం ధర్మరాజు స్వామి పట్టాభిషేకంతో పరిసమాప్తి అయినట్లు సర్పంచ్ కేజీ రోస్‌రెడ్డి తెలిపారు. అంతకు ముందు ఉదయం పట్టణంలో విశేష అలంకరణలో ఉన్న ద్రౌపదీ అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. వసంతోత్సవం నిర్వహించారు. రాత్రి పట్టాభిషేకంతో తిరునాళ్ల ముగిసింది. ప్రశాంతంగా ముగియడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

సైన్స్‌తోనే దేశాభివృద్ధి



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి: సైన్స్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని ఊరందూరు జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి అన్నారు. జూలై 28 నుంచి 30వ తేదీ వరకు తిరుపతి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సంస్థ, రీజినల్ సైన్స్ సెంటర్, రాయల్ సొసైటీ ఆఫ్ ఇంగ్లాండ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన మొదటి యూసఫ్ హమీద్ కెమిస్ట్రీ శిబిరానికి ఊరందూరు ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికై శిక్షణ పొందారు.

ఈ నేపథ్యంలో సోమవారం పాఠశాలలో మహేశ్వరి, జ్ఞానశ్రీ విద్యార్థినులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ, సైన్స్‌పై మక్కువ పెంచుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. దేశాన్ని ప్రపంచంలో ఉన్నత స్థానాలకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, మురళి, మల్లికార్జున, సుమతి, వరలక్ష్మి, రజియా, అనూష తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి



బాలికోన్నత పాఠశాల ఆవరణలో సమావేశమైన ఐద్వా మహిళలు



శ్రీకాళహస్తి : మాట్లాడుతున్న ఐద్వావ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రేణిగుంట: మహిళలపై దాడులను అరికట్టాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. మద్యం, మత్తు పదార్థాల వల్లే మహిళలపై హింసాత్మక ఘటనలు ఎక్కువవుతున్నాయని పేర్కొన్నారు. హింసలేని సమాజ నిర్మాణం కోసం చేయి, చేయి కలుపుదామంటూ ఐద్వా ఆధ్వర్యంలో ఈనెల 28న సత్యసాయి జిల్లాలో ప్రారంభమైన రాష్ట్ర బస్సుయాత్ర సోమవారం మధ్యాహ్నం రేణిగుంటకు చేరుకుంది. స్థానిక బాలికోన్నత పాఠశాల ఆవరణలో మహిళల సమస్యలపై సదస్సు నిర్వహించారు. మహిళలపై నిత్యం దాడులు, అఘాయిత్యాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బాలికలు స్వీయ రక్షణకు తీసుకోవాల్సిన చర్యలను ఆమె వారికి వివరించారు. మణిపూర్‌లో సభ్య సమాజానికి తలవంపులు తెచ్చేరీతిలో ఇద్దరు యువతులను నగ్నంగా ఊరేగించి, సామూహిక అత్యాచారం చేసిన ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. సుప్రీం కోర్టు ఈ ఉదంతంపై ఆగ్రహం వ్యక్తం చేసినా పటిష్ట చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మస్తాన్‌బి, హైస్కూల్ హెచ్‌ఎం విష్ణువర్ధనం, ఐద్వా నెల్లూరు జిల్లా అధ్యక్షురాలు శివకుమారి, ఎస్‌ఎఫ్‌ఐ డబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి, తిరుపతి జిల్లా ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు జయంతి, సాయి లక్ష్మి, మండల ఐద్వా నాయకులు లక్ష్మి, రాజేశ్వరి, ఈశ్వరమ్మ, సత్యశ్రీ, అంగన్‌వాడీ వర్కర్ల సంఘ నాయకురాలు అంబిక తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: స్త్రీ సమానత్వం కోసం ప్రతిఘటన తప్పదని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. హింసపై ఐద్వా మహిళా పోరు యాత్ర సోమవారం శ్రీకాళహస్తి పట్టణానికి చేరుకుంది. తొట్టంబేడు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలోల ఐద్వా సమావేశం ఏర్పాటు చేసింది. రాజకీయ లబ్ధికోసమే మణిపూర్‌లో విధ్వంసం, అరాచకం సృష్టించారన్నారు. మూడు నెలలు గడుస్తున్నా బీజేపీ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. మహిళా రెజర్లపై బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడితే బీజేపీ ప్రభుత్వం మాత్రం పట్టించకోవడం లేదని విమర్శించారు. బాధిత మహిళల తరఫున ఐద్వా పో రాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఐద్వా సభ్యులు పాల్గొన్నారు.

మరుగుదొడ్డి నిర్మిస్తే రూ. 12 వేలు



మాట్లాడుతున్న ఏఈ సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని జగనన్న కాలనీలో ఇళ్ల లబ్ధిదారులు మరుగుదొడ్డి నిర్మించుకుంటే కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ కార్యక్రమం కింద రూ. 12 వేలు బిల్లు చెల్లిసుందని హౌసింగ్ ఏఈ సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో హౌసింగ్ పథకంలో 941 ఇళ్లు మంజూరు కాగా అందులో 602 ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయని తెలిపారు. 120 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని, త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. నిర్మాణాలను బట్టి వారికి బిల్లులు, సిమెంట్‌ను త్వరితగతిన అందిస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అరణివిద్యానాథరెడ్డి, ఏఈ త్రివిక్రమ్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రొట్టెల పండుగ



దర్గా వద్ద ప్రార్థనల్లో బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న హజరత్ జుంలేషావలి పీర్ దర్గాలో సోమవారం రొట్టెల పండుగ మహోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బియ్యపు పవిత్రారెడ్డి మాట్లాడారు. మత సామరస్యానికి అద్దం పట్టేలా దర్గాలో రొట్టెల పండుగ నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మున్నా రాయల్, సయ్యద్ అహ్మద్, సయద్ బాబా ఫరీద్, రాజేశ్వర రావు, గరికపాటి రమేష్, పులి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సిబ్బందిపై దాడి

తిరుపతి క్రైం: విధుల్లో ఉన్న పారిశుద్ధ్య సిబ్బందిపై కొంతమంది ఆకతాయిలు దాడికి పాల్పడిన ఘటన సోమవారం రాత్రి తిమ్మినాయుడుపాలెంలో చోటుచేసుకుంది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది కథనం మేరకు.. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజా ఆధ్వర్యంలో మరో ఇద్దరు సిబ్బంది తిమ్మనాయుడుపాలెం ఎస్సీ కాలనీలో సోమవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఫాగింగ్ చేపట్టారు. ఈ క్రమంలో ఖాళీ స్థలంలో మద్యం సేవిస్తున్న నలుగురు యువకుల వైపు పొగ వెళ్లడంతో ఆగ్రహించి కట్టెలతో దాడి చేశారు. ముగ్గురూ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ అక్కడికి చేరుకున్నారు. వారిని తన కారులో రుయా ఆసుపత్రికి తరలించారు. ఆకతాయిలను శిక్షించాలని కోరుతూ పారిశుద్ధ్య కార్మికుల అసోసియేషన్ నాయకులు, సిబ్బంది సుమారు 150 మంది తిమ్మినాయుడు పాలెం రోడ్డుపై బైఠాయించారు. గతంలోనూ మలేరియా సిబ్బందిపై కొంతమంది ఆకతాయిలు దాడి చేసిన విషయం తెలిసిందే. అధికారులు కఠిన చర్యలు తీసుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సిబ్బంది కోరుతున్నారు.